# హంసలను వేటాడొద్దు [16]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [16]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: జులై 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=3156

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [16]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** అటవీఅధికారి యూరీపెట్రోవిచ్, టీచరు నోనా యురీవ్నా, యెగార్ పొలుష్కిన్, అతని కొడుకు కోల్కాలు కలిసి అడవిలో విహారానికి వెళ్తారు. కోల్కాకు అడవిలో జంతుజాల వివరాలు నమోదు చేసే బాధ్యతను అప్పగిస్తాడు యూరీ. అతను నోనాను ఆకట్టుకోవటానికి తన అటవీ పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తుంటాడు. ఆమె మాత్రం మొదట అక్కడ తన అవసరం ఏమీ కనిపించక ఇబ్బంది పడుతుంది. తర్వాత అందరికీ వంట చేసి పెట్టడంలో సంతోషాన్ని పొందుతుంది. అంతా సుష్టుగా భోంచేస్తారు. యూరీ – నోనాలను గమనిస్తున్న కోల్కా అమాయకంగా 'నువ్వు యూరీని పెళ్లి చేసుకుని వెళ్లిపోతావా' అని అడుగుతాడు. నోనా తానసలు పెళ్లే చేసుకోనంటుంది. **ఇక చదవండి:——**

## 16

కొత్త అటవీ వార్డెను తనను కూడా అతడి బృందంలోకి తీసుకోవటం ద్వారా యెగార్ రహస్య కోరిక నెరవేరింది. కానీ అతడిలో వెనకటి జీవకళ; ప్రతిధ్వనిస్తూ, ఉత్సాహంగా వ్యక్తమయ్యే పూర్వపు ఆశావాదం ఇప్పుడు ఎక్కడా కనబడటంలేదు. బహుశా యెగార్ కష్టాలు అతడిని అలా మార్చాయేమో, లేదంటే మంచిలో అతనికి నమ్మకం పూర్తిగా పోయి ఉండాలి, లేక ఈ కొత్త పని అతడికి అంతగా తెలియనిదైనా అయి ఉండాలి – ఏదేమైనప్పటికీ అతడు ప్రత్యేకమైన ఆనందానుభూతి పొందటంలేదు.

ఒక వ్యక్తి జీవితంలో మంచి చెయ్యాలని ఎన్నిసార్లు కోరుకోగలుగుతాడు? కిందకు నెట్టెయ్యబడి, పరిహసించబడిన తరువాత మళ్లీ ఎన్నిసార్లు పైకి లేచి, నవ్వుతూ, ఉత్సాహంగా పనిచెయ్యగలుగుతాడు? ఎన్నిసార్లు? ఎవరికి తెలుసు? ఒక్కసారేనేమొ, వందసార్లేమొ? బహుశ యెగార్ తన ప్రతిఘటనా శక్తినంతటినీ వెచ్చించేశాడేమో. డబ్బాలన్నింటిని మట్టసంగా తుడిచేసి ఉన్న గింజలన్నింటినీ వాడేసుకున్నట్టు ఇప్పుడతనిలో గడ్డి తప్ప ఏమీ మిగిలి లేదేమో? ఈ నిల్వలు ఎక్కడ ఉంటాయి, వాటిని ఎవరు అంచనా వేసి పరిశీలిస్తూ ఉంటారు? ఇదంతా వదిలేసి యూరి పెట్రోవిచ్‌ని కొట్టి మూడు రూబుళ్లు తీసుకుని ఫిల్, క్రోక్‌ల దగ్గరకు వెళితే పోలా?

ఎవరికి తెలుసు యెగార్ తన అదృష్టాన్ని విడిచిపెట్టి అదే చేసి ఉండేవాడేమో. తన మీద తనకి నమ్మకం పోయి, కొత్త అటవీ వార్డెన్‌ని నమ్మటానికి భయపడి ఆ పనే చేసి ఉండేవాడేమో. తన కాళ్లమీద నిలబడటానికి, తనలోకి తాను చూసుకోటానికి, యెగార్ పొలుష్కిన్ మరీ అంత తీసిపారెయ్యదగ్గ మనిషి కాదన్న ప్రజల నమ్మకాన్నీ, గౌరవాన్ని పొందటానికి కొత్త ప్రయత్నాలన్నింటినీ విరమించుకుని అతడా పని చేసి ఉండేవాడేమో. కోల్కా తన పక్కన నడుస్తూ ఉండకపోతే అతడా పని చేసి ఉండేవాడేమో. అడవితో, జంతువులతో కోల్కా ఎంతో సంబరంగా ఉన్నాడు. పిచ్చి పిల్లాడు, ఇది నిజంగానే చాలా అద్భుతమైన జీవితం అనుకుంటున్నాడు. అతడి సంతోషాన్ని చూస్తూన్న యెగార్ ఆ సంతోషాన్ని వమ్ము చెయ్యకూడదు అనుకున్నాడు. అన్నింటికీ మించి, కోల్కా ఈ ఆనందాన్ని ఎవరైనా వమ్ము చేస్తారేమోనని భయంకరమైన మరణంకంటే ఎక్కువగా యెగార్ భయపడసాగాడు. ఎటువంటి మచ్చ లేకుండా నమ్మకంతో చూసే ఆ కళ్లని ఎవరైనా మోసం చేస్తారేమో. అవి స్వచ్ఛతతో, విశ్వాసంతోటి మిణుక్కుమనే కళ్లు.

"నాన్నా, పిగిలిపిట్టని సరిగ్గానే రాశానా?"

"ఆఁ, గడియారం జాగ్రత్త, కొడుకా."

"నాకు తెలుసు, నాకు తెలుసు!"

ఈ పక్షులను, పురుగులను లెక్కపెట్టటం వల్ల ఏమిటి ఉపయోగం – ఇవి ఎవరికి కావాలి? ఏదో సరదాకి తప్పించి కానీ కోల్కా ఇదంతా ఉపయేగమని నమ్ముతున్నాడు. అతడి కళ్లు మెరుస్తున్నాయి, అతడి మనస్సు అందులో లగ్నమై ఉంది, అతడు మీ మాటలనన్నింటిని నమ్ముతున్నాడు. వాళ్లు చీమలతో వ్యవహరించినట్లు నాతోనూ, కోల్కాతోనూ వ్యవహరించదలుచుకుంటే, ఒక్క క్షణం ఆగండి. నా విషయంలో ఫర్వాలేదు, కానీ పిల్లవాడి విషయంలో ఒప్పుకోను.

"కోల్కాకి నోటు పుస్తకం నిజంగా ఉపయోగంగా ఉంటుందని ఇచ్చారా, లేక ఊరికే సరదాకా?"

"సరదాకేమిటి?"

"చలిమంట దగ్గర చేరినప్పుడు నవ్వుకోటానికి కాదా?"

యూరి పెట్రోవిచ్ దానికి వెంటనే బదులివ్వలేదు. అతడు ఒక్క క్షణం ఆలోచించి యెగార్ వంక చూసాడు. అతడి ముఖం నుంచి నవ్వు మాయమయ్యింది.

“నాకు పక్షులు అవసరం లేదు, యెగార్ సవెలిచ్, జంతువుల జాబితా కూడా అవసరం లేదు. నాకు కోల్కాయే కావాలి. అర్థమయ్యిందా? అడవిలోకి అతడు ఒక అతిథిగా కాక ఒక నిపుణుడిగా అడుగుపెట్టాలన్నది నా కోరిక: ఏది ఎక్కడ ఉందో, ఏది ఎక్కడ జీవిస్తుందో, వాటిని ఏమంటారో అతడికి తెలిసి ఉండాలి. చలిమంట విషయానికొస్తే... యెగార్ సవెలిచ్, చలిమంట దగ్గర అందరం కూర్చుని, కలిసి నవ్వుకుందాం. అయితే మనం పని గురించి నవ్వుకోం: పని ఏదైనా అది మనిషి శ్రమ. మనిషి శ్రమ గురించి మనం నవ్వుకోం.”

ఈ మాటలతో యెగార్ ఆలోచనలు పూర్తిగా వేరే దారి పట్టాయనటం సరికాదు: ఆలోచనలు రైలు ఇంజన్లు కావు. అయితే కోల్కాకి సంబంధించినంతవరకు అతడి భయాలు పోయి కొంత కొత్త ఉత్సాహం వచ్చింది. తన కొడుకును చూసి నవ్వే ఉద్దేశం ఇక్కడెవ్వరికీ ప్రస్తుతానికి ఉన్నట్టు లేదు. తనగురించి యెగార్‌కి ఎటువంటి చింతా లేదు.

అయితే ఆ సాయంత్రం నవ్వే సందర్భం ఎవ్వరికీ రాలేదు, ఎందుకంటే నోనా కనపడకుండా పోయింది. మధ్యాహ్న భోజనం తరువాత కడుగుతున్న గిన్నెలను మధ్యలో వదిలిపెట్టి ఉన్నట్టుండి ఆమె మాయమైపోయింది. దాంతో తీరుబడిగా విశ్రాంతి తీసుకోటానికి బదులు కంగారుగా ఆమెకోసం వెతకటం సరిపోయింది.

ఒంటరిగా ఉండాలన్న నోనా కోరిక కారణంగా ఆ వెతుకులాట అవసరమయ్యింది. కోల్కా దృష్టి మళ్లిన క్షణాన్ని ఉపయోగించుకుని నోనా పొదలలోకి దూరి గుడారంనుంచి, తనకి అంతగా తెలియని ఆ ఇద్దరి మగాళ్లనుంచి, అన్నిటికీ మించి కోల్కా నుంచి సాధ్యమైనంత దూరంగా వెళ్లటానికి ఆమె శక్తినంతటినీ కూడగట్టుకుని పరిగెత్తసాగింది. మాటలు వినపడుతున్నంతసేపు ఆమె పరిగెడుతూనే ఉంది, ఆ క్షణంలో కోల్కా పాడటానికి నిర్ణయించుకోవటంతో ఆమె చాలాసేపే పరిగెత్తాల్సివచ్చింది. పరిగెడుతున్నంతసేపు తిరిగి వెనక్కి ఎలా వెళుతుందన్న ఆలోచన ఆమెకు రాలేదు; తను లేకపోవటాన్ని ఎవరూ గమనించరని ఆమె ఆశించింది.

ఆ తరువాత ఒంటరిగా ఉండాలన్న కోరిక చల్లబడి వెనుతిరిగినప్పుడు ఆమెకు ఎటు చూసినా అడవి ఒకేరకంగా అనిపించసాగింది. కేవలం తన సహజాతం మీద ఆధారపడాలని నిర్ణయించుకున్న నోనా ధైర్యంగా నడవసాగింది.

అదృష్టవశాత్తు ఆమె లేకపోవటాన్ని వెంటనే గుర్తించారు. కోల్కా తన పాటను ప్రత్యేకించి ఆమెకోసం పాడుతూ ఆమె మెప్పును ఆశించాడు. అయితే శ్రోత అక్కడ లేదు. చుట్టుపక్కల కొంచెంసేపు వెదికిన తరువాత ఆ విషయాన్ని తండ్రికి చెప్పాడు.

“ఆమె కాసేపట్లో వచ్చేస్తుంది,” అని యెగార్ బదులిచ్చి, నోనా వదిలివెళ్లిన గిన్నెలు కడగటానికి పూనుకున్నాడు.

పళ్లాలు, గరిటెలు అన్నీ శుభ్రంగా కడిగాక కూడా టీచరు జాడ లేదు. యెగార్ రెండుసార్లు ఆమెకోసం కేకపెట్టి యూరికి ఆ విషయం తెలియచేసాడు.

“శంక తీర్చుకోటానికి ఏమైనా వెళ్లిందేమో,” అన్నాడు యూరి పెట్రోవిచ్.

“అదైనా అరగంట క్రితం తిరిగి వచ్చి ఉండాల్సింది,” అన్నాడు యెగార్. “ఆమె నా కేకలకు కూడా బదులివ్వటం లేదు.”

“నోనా యురీవ్నా!” అంటూ అటవీ వార్డెను పెద్దగా అరిచాడు. “ఎక్కడున్నావు?”

ఆమె బదులుకోసం వాళ్లు ఎదురు చూడసాగారు. వాళ్లకి అడవి శబ్దాలు మాత్రమే వినపడసాగాయి.

అవి దూరం నుంచి వినపడుతున్న సాయంత్రపు వింతైన శబ్దాలు.

“ఏమయ్యింది?!” యూరి పెట్రోవిచ్ భృకుటి ముడిపడింది. “నోనా!... ఓయ్! ఎక్కడున్నావు?”

“శ్మశానం మాదిరి ఉంది,” చెవొగ్గి వింటూ అన్నాడు యెగార్.

“ఏమిటి?” ఆందోళనగా అన్నాడు యూరి పెట్రోవిచ్.

“ఆమె ఇంటికి వెళ్లిందేమో?” మెల్లగా సూచించాడు కోల్కా. “కోపం వచ్చి ఇంటికి వెళ్లి ఉండవచ్చు.”

“ఇల్లు చాలా దూరంగా ఉంది,” అనుమానంగా అన్నాడు యెగార్.

యూరి పెట్రోవిచ్ ఆ ప్రాంతం చుట్టూ పరిగెత్తుతూ అరుస్తూ, ఈలవేయసాగాడు.

"ఆమె కోసం వెదకటానికి బయలుదేరాలి. కోల్కా, ఇక్కడినుంచి ఒక్క అడుగు కూడా కదలకు! ఒంటరిగా ఉండటానికి భయం వెయ్యదుగా?"

"లేదు," కోల్కా నిట్టూర్చాడు. "ఉండాల్సివస్తే ఉంటాను."

"ఉండాలి, కొడుకా," చెప్పాడు యెగార్. పెద్దవాళ్లిద్దరూ చెరొకవైపుకి వెళ్లారు. "ఓ, నోనా యురీవ్నా!"

వాళ్ల గొంతు బొంగురుపోయేలా కేకలు వేశారు. తుపాకి వెంట తెచ్చుకోనందుకు యూరి పెట్రోవిచ్ బాధపడ్డాడు, ఆ తరువాత ఈ అమ్మాయిని తీసుకొచ్చి తప్పు చేశానేమోననుకున్నాడు. తనకి ఏమయ్యింది?! అయితే అతడు ఎంతో సేపు బాధపడాల్సి రాలేదు. ఉన్నట్టుండి అతడికి అడవి సందె చీకట్లో అర్థంకాని, జాలిగొలుపుతూ, ఏడుస్తున్నదేదో కనపడింది. అదేంటో అతడికి అర్థమయ్యేలోపు నోనా అతడి మెడ చుట్టూ చేతులు వేసి, "యూరి పెట్రోవిచ్!" అంటూ చిన్నపిల్లలాగా ఏడ్వసాగింది. ఆ ఏడ్పు పెద్దగా ఉండి, అందంగా ఏమీ లేదు. ఆమె ముక్కు ఎగబీలుస్తూ, అరచేతులతో కళ్లు తుడుచుకుంటూ శ్వాస కోసం ఆగింది. "పిచ్చి పిల్లా!" యూరి పెట్రోవిచ్ సంతోషంగా అన్నాడు. "ఇదేమీ కిరోవ్ పార్కు కాదు." ఇంకా బెక్కుతూనే నోనా అంగీకారంగా తల ఊపింది. నవ్వాపుకోటానికి ప్రయత్నిస్తూ యూరి పెట్రోవిచ్ అడవిలో చీకటిపడి తన నవ్వే కళ్లు నోనాకి తెలియనందుకు సంతోషించాడు. "మూడడుగులు వెనక్కి రాలేక టీచరు దారి తప్పింది. ఈ విషయం మీ పిల్లలకు చెబితే –" "చెప్పొద్దు." "సరే, నేనంటే చెప్పననుకో. కానీ కోల్కా సంగతేమిటి?" నోనా యురీవ్నా ఏం మాట్లాడలేదు. చీకటిపడిన అడవిగుండా వాళ్లు వెనక్కి వస్తున్నారు: యూరి పెట్రోవిచ్ ముందు నడుస్తూ నోనాకి దారి చేస్తున్నాడు. కాళ్లకింద నలుగుతున్న ఎండుపుల్లలు బాగా శబ్దం చేస్తున్నాయి.

"తుపాకీ పేలుళ్లతో ముందుకు సాగుతూ," అంటూ యూరి పెట్రోవిచ్ ఎత్తుకున్నాడు. కానీ వెంటనే తన పాండిత్య ప్రదర్శన అనుచితంగానూ, అసందర్భంగానూ ఉందని గుర్తించి ఆగిపోయాడు. "నేను మూర్ఖురాలిగా వ్యవహరించానా?" తెలుసుకుందామని అడిగింది నోనా. "కొంచెం." అదంతా ఎలా జరిగిందో వివరించాలని నోనా అనుకుంటుండగా యెగార్ పొలుష్కిన్ వాళ్లకి ఎదురయ్యాడు. "హమ్మయ్య! ఆమె దొరికింది కదా... ఈ ప్రాంతంలో ఎలుగ్గొడ్డులు లేవు

కానీ తప్పిపోవటం కష్టం కాదు. కోల్కా దిక్సూచి పోయింది, లేకపోతే అది నీకు ఇచ్చి ఉండేవాడిని.” కోల్కా ఏం ప్రశ్నలు అడుగుతాడోనని నోనా యురీవ్నా లోపల్లోపల భయపడింది కానీ అటువంటిదేమీ లేకుండా అతడు ఆమెను సంతోషంగా స్వాగతించాడు. “ఇక నన్ను వదిలి వెళ్లకు,” అనిమాత్రం అన్నాడు. “సాయంత్రానికి వినోదం సరిపోయిందా?” యూరి పెట్రోవిచ్ నవ్వాడు. “సరే, ఇక నిద్రపోదాం. అమ్మాయిలూ, పిల్లలు గుడారంలోకి, మగవాళ్లు చెట్టుకిందకి.” కోల్కా తల దిండును తాకిందో లేదో అతడు నిద్రలోకి జారుకున్నాడు. యెగార్ లేత కొమ్మలతో మెత్తటి పక్క ఏర్పాటు చేసాడు, కానీ నోనా కాసేపు మెలకువగానే ఉంది. యూరిని తాను నిజంగానే ముద్దుపెట్టుకుందన్నమాట. తన భయమూ, కన్నీటిలో ఏమి చేస్తోందో ఆమెకే తెలియలేదు. ఆ క్షణంలో ఫిల్ లేదా క్రోక్ గానీ ఎదురై ఉంటే కూడా హత్తుకుని ఉండేదే. అయితే ఆమెకు ఎదురయ్యింది యూరి పెట్రోవిచ్, గడ్డం చెయ్యని అతడి గరుకు చెంప ఇంకా నోనా యురీవ్నా పెదవులకు తెలుస్తూనే ఉంది. ఆ పెదాలను వేలితో నిమురుతూ ఆమె నవ్వుకుంది. మగవాళ్లిద్దరూ వెంటనే నిద్రపోయారు. యెగార్ తల వెనక్కి వాల్చి గురకపెట్టసాగాడు, యూరి పెట్రోవిచ్ నిద్రలోనే భృకుటి ముడివేసి నిట్టూరుస్తున్నాడు. ఏదైనా పీడకల కంటున్నాడో లేక గురకపెట్టే యెగార్ పక్కన ఉన్నందుకు ఇబ్బందిపడుతున్నాడో. వేగుచుక్క పొడవకముందే యెగార్ నిద్రలేచాడు. ఆ అలికిడికి మేల్కొన్న యూరి “ఎక్కడికి వెళుతున్నావు? పొద్దుపొడవటానికి ఇంకా చాలా సమయం ఉంది,” అన్నాడు.

“నేను, అది..” యెగార్ ఎందుకో ఇబ్బందికి లోనయ్యాడు. “నేను కొంత బయట తిరిగి వస్తాను. మీరు నిద్రపోండి.” యూరి పెట్రోవిచ్ తన గడియారంవంక చూసుకున్నాడు – అయిదు కావస్తోంది. అతడు అటు తిరిగి నోనా ఎలా నిద్రపోతోందో అనుకుంటూ గాఢ నిద్రలోకి జారిపోయాడు. యెగార్ నీటి పాత్ర తీసుకుని వాగువైపుకి బయలుదేరాడు.

నీటిమీద మంచుతెర ఇంకా అక్కడక్కడా అంటిపెట్టుకుని ఉంది. మంచుకి పొదలన్నీ తడితడిగా ఉన్నాయి. ఆ ఉదయం నిశ్చలంగా ఉన్న నీళ్లు, దాన్లోకి తొంగిచూసే ప్రతిదానిని ప్రతిబింబిస్తోంది. యెగార్ పాత్రని నీటిలో ముంచటంతో అలల ప్రకంపన ఒకటి మొదలయ్యింది; అతడి ప్రతిబింబం కూడా చెదిరి, ఒక్క క్షణం మాయమయ్యి, మళ్లీ మునుపటి స్పష్టతతో ప్రత్యక్షమయ్యింది. ప్రతిబింబాన్ని ఉలిక్కిపడేలా చేస్తానేమోనన్న భయంతో యెగార్ దానివంక

జాగ్రత్తగా చూస్తున్నాడు. నిండిన పాత్రను నీటినుంచి బయటకు తీసి దానిని గట్టుమీద పెట్టి వాగు పక్కన కూర్చున్నాడు.

ఉన్నట్టుండి ఒక వింతైన, పరిపూర్ణ ప్రశాంతత అతడిని ఆవహించింది. అతడు ఆ నిశ్శబ్దాన్ని విన్నాడు, నిశ్శబ్దం అంటే నిజానికి ఎటువంటి శబ్దమూ లేకుండా ఉండటం కాదని అది ప్రకృతి విశ్రాంతి అని, దాని కల అని, పొద్దుపొడవకముందు అది వదిలే నిట్టూర్పని అతడు అర్థంచేసుకున్నాడు. ఉదయపు మంచు తాజాతనాన్ని అతడు తన శరీరమంతటితో అనుభూతి చెందాడు, విల్లో పొదలనుంచి తీసుకున్న దాని ప్రత్యేక వాసనని పసిగట్టగలిగాడు. నీటిలో భుజపత్ర చెట్ల తెల్లటి మొదళ్లు, ఆల్డర్ చెట్ల ఆకుపచ్చటి పత్రావరణం కలువలతో పెనవేసుకుని నింగికి ఎగుస్తూ, అట్టడుగున ఏకమౌతూన్న దృశ్యాన్ని అతడు చూశాడు. మరుక్షణంలో ఇదంతా శాశ్వతంగా మాయమౌతుందని గుర్తించటంతో తెలియని విషాదం అతడిని కమ్ముకుంది. ఆ దృశ్యం మళ్లీ ప్రకటితమైనప్పుడు అది స్థానిక సోవియట్‌లో చిల్లర మల్లర పనులు చేసే యెగార్ పొలుష్కిన్ చూసినదానికంటే భిన్నంగా ఉంటుంది. అతడికి ఏం చెయ్యాలనిపిస్తోందో ఆ క్షణంలో అతడికి ఎరుకపడినట్టయ్యింది: ఆ అమలిన అందాన్ని జారిపోకుండా, గజిబిజికాకుండా దోసిలిలోకి ఒడిసిపట్టి ప్రజలందరికీ ఇవ్వాలని ఉంది. అయితే దానిని దోసిట పట్టటం అసాధ్యం, యెగార్ బొమ్మలు వెయ్యలేడు, జీవితంలో అప్పటివరకు అతడు ఒక్క చిత్రపటాన్ని కూడా చూడలేదు. నీటిని కదల్చటానికి భయపడుతూ చుట్టకాల్చటం మరిచిపోయి, నీటిపాత్రని మరిచిపోయి, కోల్కాని, యూరి పెట్రోవిచ్‌ని, తన అర్థంలేని జీవితంలోని కష్టాలన్నింటినీ మరిచిపోయి వాగు ఒడ్డున అతడు మౌనంగా కూర్చుండిపోయాడు.

దగ్గరలో ఏదో అలికిడి అయినట్టు అనిపించింది. యెగార్ పైకి చూసాడు: పొదలచాటున ఏదో తెల్లగా కదిలినట్టు అనిపించింది. ఎవరో నిట్టూర్చారు, జాగ్రత్తపడుతూ విడిచిన సగం నిట్టూర్పు. అతడు మెడసాచి ఆకులచాటున ఉన్న నోనా యురీవ్నాని చూసాడు: ఆమె అప్పుడే బట్టలు విడిచి కొంగమాదిరి ఆచితూచి అడుగులు వేస్తూ తెల్లటి పాదంతో నీళ్లు ఎంత చల్లగా ఉన్నాయో పరిశిలిస్తోంది. నీటిపాత్రని తీసుకుని అక్కడినుంచి వెళ్లాలని అనుకున్నాడు యెగార్. అయితే, ప్రపంచమంతటినీ మరిచిపోయి అతడు చూసిన దృశ్యంనుంచి కూడా ఆ సగం నిట్టూర్పులు, లాలిత్యపు కదిలికలు వస్తున్నట్టనిపించి అక్కడే కూర్చుండిపోయాడు.

ఈలోగా నోనా తన వంటి మీదున్న మిగిలిన బట్టలు తీసేసి నీటిలోకి దిగింది. నీటి లోతును పరిశీలిస్తూ ఆమె మెల్లగా కదులుతోంది. ఆ కదలికలు ఏక కాలంలో మనోహరంగానూ, మోటుగానూ అనిపించసాగాయి. అంతకుముందు వాగులోని దృశ్యాన్ని చూసినంత ప్రశాంతతో ఇప్పుడు యెగార్ ఆ యువతిని చూస్తున్నాడు: ఆమె పొడవాటి కాళ్లు, ఒంగి సన్నగా ఉన్న భుజాలు, ఎదిగీ ఎదగనట్టున్న చిన్న పాలిండ్లు, ఒడ్డున తీసి పెట్టటానికి మనస్కరించని కళ్లద్దాలు. లోతు తక్కువగా ఉన్న నీటిలో ఆమె స్నానం చేస్తూ ఉండగా చూస్తూండటం తొంగి చూడటం కాదని, దీంట్లో సిగ్గు పడాల్సింది ఏదీ లేదని, వాగు, మంచు, భుజపత్ర చెట్టులో చూసిన అందాన్నే ఇక్కడ కూడా చూస్తున్నాని అతడికి అర్థమయ్యింది.

ఒళ్లు కడుక్కుని, నీటినుంచి బయటకు వచ్చి ఒడ్డుకి చేరిన తరువాత నోనా వంటిలో ఎబ్బెట్టుతో కూడిన భయం నిండిపోయినట్టు అనిపించింది; ఆమె కప్పుకోవాలనిపించిందంతా కప్పుకోటానికి సరిపడా చేతులు లేవన్నట్టు అనిపించింది. ఆమె ఒంగుని, మెడని సాధ్యమైనంతగా చాచి భయంభయంగా పొదలలోకి చూడసాగింది. ఆమె కళ్లద్దాలనుంచి జారుతున్న నీటిబొట్లు కన్నీటి బిందువుల మాదిరి ఉన్నాయి. యెగార్ బయలుదేరబోయాడు కానీ వాగు తీరాన ఆమె స్థిమితపడి జుట్టు దువ్వకోటానికి కురులను పిండుతూ, ఆరబెట్టుకుటోంది. ఆమె మరోమారు వంగింది, అయితే ఈసారి సిగ్గుతో కాకుండా ఎటువంటి ప్రతిబంధకాలు లేకుండా స్వేచ్ఛగా ఉంది. ఆకస్మికంగా యెగార్‌ని నింపేసిన ఉద్వేగంతో అతడు బలంగా ఊపిరి పీల్చసాగాడు. ఈ క్షణాన్ని కూడా బండబారిన తన చేతుల్లో ఒడిసిపట్టి ప్రజలకి అందించలేకపోతున్నానే అని – అది అసాధ్యమని తెలిసి – బాధపడసాగాడు.

అంతలో అతడు స్పృహలోకి వచ్చి నీటిపాత్ర తీసుకుని పొదలగుండా బయటకువచ్చి గుడారానికి నోనా కంటే ముందు మరోవైపునుంచి చేరుకున్నాడు. ఆ తరువాత వాళ్లు నాస్తా చేసి, గుడారం ఊడతీసి, వస్తువులన్నీ సర్దుకుని బయలుదేరారు. అంతసేపు యెగార్ నిశ్శబ్ద వాగునీ, అందమైన తెల్లటి ఆకారాన్నీ చూస్తూనే ఉన్నాడు. దాంతో అతడినుంచి ఒక నిట్టూర్పు వెలువడింది.

భోజనసమయానికి వాళ్లు నల్లచెరువు తీరానికి చేరుకున్నారు. అది నిజంగానే నల్లగా ఉంది: ఒంటరిగా, రహస్యంగా ఉంది, దాని నిశ్చలనీటి అంచున బండి గురవింద చెట్లు ఉన్నాయి.

“ఎట్టకేలకు చేరుకున్నాం,” భుజంసంచి కిందకి దింపుతూ సంతోషంగా అన్నాడు యూరి పెట్రోవిచ్. “నువ్వు తయారుకా, కోల్కా. కొన్ని చేపలను పట్టుకుని వద్దాం.”

అతడు మడతపెట్టే చేపల గాలాన్ని, గరిటఎరల డబ్బాని తీసుకుని నీళ్లవైపుకి వెళుతున్నాడు. కోల్కా ఆ వింత గాలాన్ని చూస్తూ అతడి పక్కన పరిగెడుతున్నాడు.

“పురుగును ఎరగా వాడతారా, యూరి మామా?”

“ఇది గరిటఎర. బల్లెం, కిలిపోతు చేపలకు పనిచేస్తుంది.”

“ఊఁ...” అనుమానంగా అన్నాడు కోల్కా. “దీనివల్ల సమయం వృధా తప్పించి ఫలితం ఉండదనిపిస్తోంది.”

“ఏమో, చూద్దాం. పక్కకి జరగండి, పొలుష్కిన్.”

అయిదవసారి విసిరినప్పుడు దారం బిగుతుగా అయ్యింది. గాలాన్ని లాగితే రెండు కిలోల బల్లెం చేప వచ్చింది.

“చేపను పట్టాం!” అరిచాడు కోల్కా. “నాన్నా! నోనా యురీవ్నా! బల్లెంచేప దొరికింది!”

“అప్పుడే అరవకు, దానిని ఇంకా బయటకు తియ్యలేదు.”

ఒడ్డు పల్లంగానూ, తుంగ పెరిగి ఉండటంవల్ల బూడిద–ఆకుపచ్చ రంగులో, నల్లటి నోరు ఉన్న ఆ బల్లెంచేపను తియ్యటం యూరి పెట్రోవిచ్‌కి కష్టం కాలేదు. దానిని కాలితో తొక్కిపెట్టి కొక్కెంనుంచి తప్పించి తీరం నుంచి దూరంగా పడేశాడు.

“అది మన భోజనం.”

“నేను–” ఉత్సాహంతో కోల్కా గొంతు పూడుకుపోయింది. “నేను ప్రయత్నించనా?”

“ఇదిగో, ప్రయత్నించు,” అన్నాడు యూరి పెట్రోవిచ్.

గాలం ఎలా విసరాలో చూపించి, బల్లెం చేపను కట్టెకు తగిలించుకుని అతడు వెనక్కి వెళ్లిపోయాడు. కోల్కా అక్కడే ఉండి గాలాన్ని విసురుతున్నాడు. అతడికి ఇంకా అలవాటు కాలేదు కాబట్టి గరిటఎర ఎటంటే అటు వెళుతోంది. అయినా కోల్కా పట్టు విడవకుండా ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

“అది చాలా ఖరీదైనది,” యెగార్ ఆందోళన పడసాగాడు. “దానిని పాడుచేస్తాడేమో.”

"అయితే బాగుచేద్దాం," యూరి పెట్రోవిచ్ నవ్వాడు. నోనా కూడా తనదైన నవ్వుతో ప్రతిస్పందించింది.

కోల్కా ఎంత ప్రయత్నించినా చేపలు పడలేదు. అతడు నిరాశగా తిరిగివచ్చాడు. అయితే అతడు ఒక విషయం కనుగొన్నాడు:

"ఎవరో అటువైపున మంటవేసిన జాడలు, చాలా ఖాళీ సీసాలు, డబ్బాలు ఉన్నాయి."

అది చూడటానికి అందరూ వెళ్లారు. అక్కడంతా తొక్కి ఉంది, కొంతమేర కాల్చి ఉంది. ఇటీవల కొట్టిన చెట్ల మోళ్లు స్ఫోటకం మచ్చల్లా ఉన్నాయి.

"పర్యాటకులు," నిట్టూరుస్తూ అన్నాడు యూరి పెట్రోవిచ్. "రక్షిత అడవి బాధ్యత ఇస్తే చాలా బాగా పనిచేస్తున్నావు, బుర్యానోవ్!"

"అతడికి ఈ విషయం తెలియదేమో," యెగార్ మెల్లగా అన్నాడు.

పర్యాటకులు సరిహద్దు గుర్తును సైతం పీకేసి దానిని కూడా తగలబెట్టారు: నేలలో రంధ్రం, కాలిన దుంగ అక్కడ మిగిలాయి.

"వినోదాలు బాగానే ఉన్నాయి!" యూరి పెట్రోవిచ్ కోపంగా అన్నాడు. "ఇక్కడొక కొత్త గుర్తు పెట్టాలి, యెగార్ సవెలిచ్. నువ్వు ఈ పని చూస్తూ ఉండు: ఇంకా ఎంత విధ్వంసం జరిగిందో చుట్టూ తిరిగి చూసివస్తాం."

"సరే," అన్నాడు యెగార్. "దీని గురించి మీరిక ఆందోళన చెందకండి, మీరు మీ పనిమీద వెళ్లండి."

మంటదగ్గర వాళ్లు చాలాసేపు కూర్చున్నారు. చేపలు పట్టటంతో అలసిపోయిన కోల్కా గుడారంలో గాఢనిద్రలో ఉన్నాడు. బయట నోనాని దోమలు తెగ కుట్టేస్తున్నాయి. ఆసక్తికరమైన సంభాషణ ఏదీ లేకపోయినప్పటికీ వాటిని భరిస్తూ అక్కడే కూర్చుంది. మంట వంక చూస్తూ అప్పుడొకమాట, ఇప్పుడొకమాట మాట్లాడుతున్నారు. అయితే, ముగ్గురిలోనూ ప్రశాంతత అలుముకుని, బాగుంది.

"నల్లచెరువు," నిట్టూర్చింది నోనా. "ఇంత అందమైన ప్రదేశానికి ఆ పేరు నప్పలేదు."

"ఇప్పుడిది నల్లచెరువు," అన్నాడు యూరి పెట్రోవిచ్. "కానీ పాత రోజుల్లో – నాకు పాత పుస్తకాలు చూడటమంటే ఇష్టం – పాత రోజుల్లో దీనిని ఏమనేవారో తెలుసా? హంసలచెరువు."

“హంసలచెరువా?”

“ఒకప్పుడు ఇక్కడ చాలా హంసలు ఉండేవి. ఒక ప్రత్యేకరకమైన హంసలు. జారు చక్రవర్తికి వాటి మాంసమంటే ఇష్టం. కాబట్టి వాటిని వేటాడి మాస్కోకి పంపించేవాళ్లు.”

“అంటే వాటిని తినేవాళ్లా?” యెగార్ అపనమ్మకంగా అడిగాడు.

“దాంట్లో తప్పేముంది?”

“ఒకప్పుడు వాటిని తినేవాళ్లు.”

“అప్పటి రుచులు వేరు,” అంది నోనా.

“అప్పుడు చాలా హంసలు ఉండేవి,” యూరి పెట్రోవిచ్ నవ్వాడు. “కానీ ఇప్పుడు హంసలు లేక ఇది నల్లగా ఉంది. చెరువుని ఇంకా కాపాడుకోగలగటమే ఒక అద్భుతంగా భావించాలి.”

వాళ్లతో వెళ్లటానికి కోల్కా నిరాకరించాడు: అతడు ఉదయంనుంచి చేపలు పట్టటం నేర్చుకుంటున్నాడు, కానీ దానిపై పూర్తి పట్టు సాధించటానికి ఇంకా ఎంతో సాధన చెయ్యాలి. కాబట్టి అదే పనిమీద ఉండాలని నిర్ణయించుకున్నాడు. అతడు రానంటే యూరి పెట్రోవిచ్ మామూలుగానే స్పందించాడు కానీ నోనా చాలా ఆందోళనకు గురయ్యింది, దాంతో చాలా ఆదుర్దా పడిపోయింది.

“లేదు, కోల్కా, చిన్నపిల్లవాడిలా వ్యవహరించకు! నువ్వు తప్పనిసరిగా రావాలి తెలిసిందా? విద్యా సంబంధ విషయంగానే కాక –”

“నేను బల్లెం చేపను పట్టుకోవాలి,” అన్నాడు కోల్కా.

“దానిని మళ్లీ పట్టుకోవచ్చు. తిరిగివచ్చిన తరువాత –”

“మీరు తిరిగిరండి! నేను ఇది నేర్చుకోవాలి. యూరి పెట్రోవిచ్ అయితే యాభై గజాలు విసురుతాడు.”

“మంచివాడివిగా, కోల్కా. మాతో రావా?”

యూరి పెట్రోవిచ్ నవ్వును ఆపుకుంటూ పిరికి నోనాని గమనిస్తున్నాడు. ఆ తరువాత ఆమెమీద జాలిపడ్డాడు.

“మనతోపాటు చేపల గాలాన్ని తీసుకెళదాం, కోల్కా. నీ దెబ్బకి ఇక్కడ బల్లెం చేపలన్నీ భయపడిపోయుంటాయి.”

ఈ మాటలు పనిచెయ్యటంతో కోల్కా తన వస్తువులు తెచ్చుకోటానికి పరిగెత్తాడు. “నువ్వు చాలా పిరికిదానివన్నమాట, నోనా యురీవ్నా,” అన్నాడు యూరి పెట్రోవిచ్.

సిగరెట్టు వెలిగించుకునేటంతగా నోనా ఎర్రబడింది. అంతే తప్పించి ఆమె ఏమీ మాట్లాడలేదు.

ఒంటరిగా ఉన్న యెగార్ తన పనిని తాపీగా మొదలుపెట్టాడు. యూరి పెట్రోవిచ్ తెచ్చిన పరికరాలతో గుంతను పెద్దది చేసాడు. సరిహద్దు సంకేతానికి ఒక పోప్లార్ చెట్టును గుర్తించాడు. తీరికగా చుట్టకాల్చుకుని దానిని ఏ వైపుకి పడేస్తే బాగుంటుందో గొడ్డలి పట్టుకుని దానిచుట్టూ తిరిగి చూస్తున్నాడు. చిన్నగా ఉన్న పోప్లార్ చెట్లవైపు పడెయ్యటం కుదరదు. బండి గురువింద తోపువైపు పడేస్తే ఆ చెట్లన్నీ దెబ్బతింటాయి. ముళ్లమొక్కలున్న మూడవవైపు పడేస్తే దానిని బయటకి తియ్యటానికి చాలా సమయం పడుతుంది. నాల్గవ వైపు ఏమిటి?

నాల్గవ వైపు ఎప్పుడో విరిగిపోయిన లిండెన్ చెట్టు తప్పించి ఏమీ లేదు. ఆ చెట్టు చిన్నప్పటినుంచే చాలా కష్టకాలం చూసిందని స్పష్టంగా తెలుస్తోంది. మనుగడకోసం పోరాటంలో అది మెలితిరిగింది, ఒంగింది. చాలా తక్కువ ఎత్తునుంచే కొమ్మలువేసి, మెలి తిరుగుతూ అవి అన్నివైపులా పెరిగాయి. యెగార్ దానిని చూసాడు, పోప్లార్ చెట్టు దానిమీద పడాలన్నది అతడి ప్రయత్నం. చేతుల్లో ఉమ్మేసుకుని, గొడ్డలి పైకెత్తి మరొకసారి లిండెన్ చెట్టుని చూసాడు... తరువాత గొడ్డలిని కిందకి దించేసాడు. అప్పటికింకా ఏమీ ఆలోచించకుండా, ఏమీ అర్థంకాక ఆ విరిగిపోయిన లిండెన్ చెట్టు దగ్గరకి వెళ్లాడు.

దాంట్లో అతడికి ఏదో కనపడింది. మెరుపు మాదిరి ఒక్క క్షణంపాటు మొత్తం ఒక్కసారిగా కనపడింది. ఇప్పుడు అదేమిటో తెలియటం లేదు. మెలిపడిపోయిన కొమ్మలవైపు అయోమయంగా చూస్తుండిపోయాడు. అతడు చూసినదేమిటో అతడికే అర్థంకాక కొట్టుకుంటున్నాడు.

అతడు మరొక చుట్ట కాల్చాడు. కొంచెం దూరంగా కూర్చుని చిక్కుపడిపోయిన ఆ కొమ్మలను చూస్తూ ఉన్నాడు. గొడ్డలి వేటు పడబోతున్న సమయంలో అతడు చూసిందేమిటో గుర్తుతెచ్చుకోటానికి ప్రయత్నిస్తున్నాడు. దానిని కుడివైపునుంచి చూసాడు, ఎడమవైపునుంచి

చూసాడు, ఒక అడుగు వెనక్కి వేసి ముందుకి వంగి చూసాడు. అకస్మాత్తుగా ఏర్పడిన స్పష్టతతోటి మనోచిత్రంలోంచి సగం కొమ్మల్ని తీసెయ్యటంతో అతడు అంతకుముందు చూసింది మళ్లీ ఆవిష్కారమయ్యింది. అతడికే తెలియని ఆనంద స్థితిలో ఒక్కసారిగా గెంతేసి చెట్టుచుట్టూ హడావిడిగా తిరగసాగాడు.

“అదీ సంగతి,” అలసిపోయేటంతగా అతడు ముడిపడిన కొమ్మలవైపు చూసాడు, “కాండం అమ్మాయి శరీరంలా తెల్లగా ఉంది. ఆమె తల వెనక్కి వేసి జుట్టు ఆరబోసుకుంటోంది...”

అతడి గొంతులో ఏర్పడిన ముద్దని గుటకేసాడు. గొడ్డలి ఎత్తి, వెంటనే దానిని దించేసాడు. తొందరపడకూడదని తనకి తానే చెప్పుకుని ఆ లిండెన్ చెట్టుకి కొంచెం దూరంగా వెళ్లి దానినే తదేకంగా చూస్తూ కూర్చున్నాడు. ఆపాటికే అతడు సరిహద్దు గుర్తును, కొత్త అటవీ వార్డెనుని, నోనా యురీవ్నాని, చివరికి కోల్కా గురించి మరిచిపోయాడు: ప్రపంచం మొత్తాన్నే అతడు మరిచిపోయాడు. తనలో పెరుగుతున్న ఉద్వేగమూ, దాంతో అతడి చేతులు వణకటమూ, గుండె వేగంగా కొట్టుకోవటమూ, నుదుటిమీద చెమటలు పట్టటమూ మాత్రమే అతడికి తెలుస్తున్నాయి. పాలిపోయిన కనుబొమ్మలను ముడివేసి నిలబడ్డాడు. లిండెన్ చెట్టు దగ్గరికి స్థిరంగా అడుగులువేసి గొడ్డలికి పని చెప్పాడు.

ఇప్పుడు ఎక్కడ నరకాలో అతడికి తెలిసింది. ఏమేమి తీసెయ్యాలో అతడు చూసాడు. టీచరు, కోల్కాలతో అటవీ వార్డెను తిరిగి వచ్చేసరికి ఆరిపోయిన మంట పక్కన అలసిపోయిన యెగార్ కనిపించాడు. అతడు వాళ్లవంక వెర్రి ముఖం వేసుకుని చూడసాగాడు.

“నాన్నా, నేను కిలిపోతు చేపను పట్టుకున్నాను!” వస్తూ, వస్తూనే కోల్కా అరవసాగాడు. “గాలంతో పట్టుకున్నాను!”

యెగార్‌లో ఏమాత్రం కదలిక లేదు, అతడికి ఏమీ వినపడినట్టు లేదు. యూరి పెట్రోవిచ్ బూడిదను పొడుస్తూ నవ్వాడు.

“ఇప్పుడు ఈ చేపను కాల్చాలి.”

“నేను గోధుమన్నం చేస్తాను,” యెగార్ వంక భయంగానూ, జాలితోనూ చూస్తూ అంది నోనా. “ఎంతోసేపు పట్టదు.”

“గోధుమన్నం సరే,” యూరి పెట్రోవిచ్ కొంచెం కోపంగా అన్నాడు. “నీకేమయ్యింది, పొలుష్కిన్? ఒంట్లో బాగానే ఉంది కదా?”

యెగార్ ఏమీ మాట్లాడలేదు.

“కనీసం సరిహద్దు గుర్తయినా పెట్టావా?”

యెగార్ ఒక నిట్టూర్పు విడిచి, తల అడ్డంగా ఊపుతూ లేచి నిలబడ్డాడు.

“పదండి.”

వెనక్కి తిరిగి చూడకుండా అతడు సరిహద్దు గుర్తు పెట్టవలసిన ప్రదేశం వైపుకి నడవసాగాడు. యూరి పెట్రోవిచ్, నోనా ఒకరివంక ఒకరు చూసుకుని యెగార్‌ని అనుసరించసాగారు.

“అదిగో,” అన్నాడు యెగార్. “అదే సరిహద్దు గుర్తు.”

నాజూకుగా ఉన్న ఒక అందమైన అమ్మాయి మెడవంచి జుట్టు ఆరబెట్టుకుంటోంది. అడవి ఆకుపచ్చటి సంధ్యాకాంతిలో ఆమె తెల్లటి మేను మసకబారి కనపడుతోంది.

“అదిగో,” యెగార్ మెల్లగా అన్నాడు. “నానుంచి అదే చేతనయ్యింది.”

ఎవ్వరూ ఒక్క మాట అనలేదు. యెగార్ కూడా విచారంతో మౌనంగా మారిపోయి తలవంచుకున్నాడు. ఆ నిశ్శబ్దం తరువాత ఏం వస్తుందో అతడికి తెలుసు. మరొకసారి తన ప్రపంచంలోకి కొట్టుకుపోయినందుకు తనని తాను తిట్టుకుంటూ వాళ్ల తిట్లకు సిద్ధంగా ఉన్నాడు.

“ఎవరో అమ్మాయి,” అక్కడికి చేరుకున్న కోల్కా ముఖం అయిష్టంగా పెడుతూ అన్నాడు.

“ఇది... ఇదొక అద్భుతం,” నోనా మెల్లగా అంది. “నీకింకా అంతా అర్థమయ్యే వయస్సు రాలేదు, కోల్కా.”

అలాగంటూ ఆమె కోల్కా భుజాలమీద చెయ్యి వేసింది. యూరి పెట్రోవిచ్ సిగరెట్టు పెట్టె తీసి యెగార్ వైపుకి చాచాడు. ఇద్దరూ వాటిని వెలిగించుకున్న తరువాత, “ఒక్కడివే దానిని ఇక్కడికి ఎలా తీసుకొచ్చావు, పొలుష్కిన్?”

“ఆ బలం నాలో ఉండిందనుకుంటా,” అంటూ యెగార్ బదులిచ్చి కుప్పకూలిపోయి బావురుమన్నాడు.

*(తరువాయి భాగం వచ్చే వారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige
.com